ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 07.07.2024 సమయం: 13.10 గంటలు

**ముఖ్యాంశాలు**

1. తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగ్ సమస్యల పరిష్కారానికి, రెండు వారాల్లో అధికారుల కమిటీని ఏర్పాటు చేస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

2. తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఫలితాలను వెల్లడించారు. 31 వేల 382 మంది అభ్యర్థులు మెయిన్స్ కు అర్హత సాధించారు.

3. తెలంగాణలో ఆషాఢ మాసం బోనాల వేడుకలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. గోల్కొండ కోటకు జగదాంబిక అమ్మవారి ఊరేగింపు కొనసాగుతోంది.

4. పూరీ జగన్నాథ రథయాత్ర ఈరోజు ప్రారంభమయింది. హైదరాబాద్ లో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

**తెలుగు రాష్ట్రాలు**

తెలుగు రాష్ట్రాల మధ్య పదేళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యలన్నింటినీ మూడంచెల్లో కమిటీల ద్వారా పరిష్కరించుకోవాలని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్ణయించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిన్న హైదరాబాద్ లో జరిపిన సమావేశం లో విభజన చట్టంలోని 9,10 షెడ్యూళ్లలో ఉన్న పలు అంశాలపై చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. సంస్థల ఆస్తుల విభజన, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అంశం, విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలు, 15 ఎయిడెడ్ ప్రాజెక్టుల రుణ పంపకాలు, రెండు రాష్ట్రాల స్థానికత కలిగిన ఉద్యోగుల మార్పిడికి సంబంధించిన అంశాలు ప్రస్తావనకు

వచ్చాయి. . ముఖ్యమంత్రుల సమావేశం లో తీసుకున్న నిర్ణయం మేరకు రెండు రాష్ట్రాల సీఎస్లు , ముగ్గురు అధికారులతో రెండు వారాల్లోగా కమిటీ ఏర్పాటుచేస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. వీరి స్థాయిలో పరిష్కారం కాని సమస్యలపై మంత్రులతో మరో కమిటీని వేస్తామని, సీఎస్లు , మంత్రుల కమిటీల పరిధిలో పరిష్కారం దొరకని వాటిపై ముఖ్యమంత్రుల  స్థాయిలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. కృష్ణా జలాల పంపిణీపై రెండు రాష్ట్రాలు కలిసి కేంద్రంతో మాట్లాడాలని తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి  ప్రతిపాదించారు. కేంద్రంలో కీలకంగా ఉన్న చంద్రబాబు రెండు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని రేవంత్రెడ్డి   కోరారు.

(DESK)

**రిజల్ట్స్**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఫలితాలను ఈ రోజు విడుదల చేశారు. మెయిన్స్ కు అర్హత సాధించిన అభ్యర్థుల హాల్ టికెట్ల నెంబర్లను పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెల్లడించింది. సర్వీస్ తుది కీతో పాటూ ప్రిలిమ్స్ ఫలితాలను అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉంచారు. గ్రూప్ మెయిన్స్ కు 31 ,382 మంది అభ్యర్థులు అర్హత సా ధించారు. మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21 వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయి. ఇలా ఉండగా తెలంగాణలో ఇకనుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష – టెట్ – ను ఏడాదికి రెండు సార్లు నిర్వహిస్తామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి ఏటా జూన్ , డిసెంబర్ నెలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు.

(డెస్క్)

**కాళేశ్వరం**

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ దర్యాప్తు వేగాన్ని పెంచింది. ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం, సుందెళ్ళ బ్యారేజీలకు సంబంధించి సాంకేతిక

అంశాలపై విచారణ చేపట్టిన కమిషన్ , ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన లక్ష్మి , సరస్వతి, పార్వతి పంప్ హౌస్ లు వరద నీటిలో మునగడానికి కారణాలపై కూడా దర్యాప్తు జరపాలని నిర్ణయించింది. ఈ పంప్ హౌస్ లకు సంబంధించిన ఇంజనీర్లు ఇతర అధికారులు రేపు విచారణకు హాజరు కావాలని కమిషన్ ఆదేశించింది. ఈ పంప్ హౌస్ లకు సంబంధించిన కాంట్రాక్టర్లు కూడా రేపు హాజరయ్యేలా చూడాలని స్పష్టం చేసింది. అలాగే కాళేశ్వరం ఎత్తిపోతలకు సంబంధించిన అన్ని ఫైళ్లను రెండు వారాలలోగా సమర్పించాలని కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

(డెస్క్)

**సిఎం విజయవాడ**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు విజయవాడ వెళతారు. విజయవాడలో జరిగే దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సభకు రేవంత్ రెడ్డి హాజరు అవుతారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆహ్వానం మేరకు రేవంత్ రెడ్డి ఈ సభకు హాజరు అవుతున్నారు. తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి కూడా ముఖ్యమంత్రి వెంట విజయవాడ పర్యటనలో పాల్గొంటారు.

(డెస్క్)

**సీతక్క**

తెలంగాణ ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే పూర్తి స్థాయి బడ్జెట్ లో పంచాయితీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖకు 51 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఆ శాఖ మంత్రి సీతక్క ఆర్థిక శాఖను కోరారు. చేయూత పథకం కింద పెన్షన్లకు 22 వేల కోట్లు , ఇతర పద్దులకు 29 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని సీతక్క విజప్తి చేశారు.

(డెస్క్)

బోనాలు

తెలంగాణలో ఆషాఢ మాసం బోనాల వేడుకలు ఈ రోజు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర పండుగగా పిలిచే బోనాల జాతరకు ఇటు జంటనగరాల్లోనూ , అటు ఇతర ప్రాంతాల్లోనూ ఆలయాలను అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. దశాబ్ది బోనాల వేడుకల పేరుతో ఈసారి ప్రభుత్వం బోనాలను మరింత ఘనంగా నిర్వహిస్తోంది. బోనాల నిర్వహణ కోసం 20 కోట్ల రూపాయలు కేటాయించింది. బోనాల డప్పు చప్పుళ్ళు , తీన్మార్ దరువులు, పోతురాజుల వీరంగాలు , ఫలహారపు బళ్ళ ఊరేగింపులతో నెలరోజుల పాటు రాష్ట్రం కోలాహలంగా మారనుంది. గోల్కొండ కోటలో బోనాల వేడుకలు ఈ ఉదయం సంప్రదాయబద్ధంగా ప్రారంభయ్యాయి. గోల్కొండ జగధాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. ప్రభుత్వం తరుపున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ రోజు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. చోటా బజార్ లోని ఆలయ పూజారి ఇంటి వద్ద అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం ఉత్సవ విగ్రహాలను గోల్కొండ కోటపైకి తీసుకువస్తారు. గోల్కొండలో ప్రారంభమయ్యే బోనాలు ఆగస్టు 4న తిరిగి అక్కడే ముగుస్తాయి. ఈ లోగా 21 ,22వ తేదీల్లో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ , 28, 29 వ తేదీల్లో లాల్ దర్వాజా బోనాలు జరగనున్నాయి.

(డెస్క్)

**ట్రాఫిక్**

గోల్కొండ బోనాల సందర్భంగా ఆ మార్గంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గోల్కొండ వెళ్ళే రోడ్లలో ఉదయం 8 గంటల నుండి రాత్రి పదకొండు గంటల వరకు వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందని పోలీసులు చెప్పారు.
(డెస్క్)

**రథయాత్ర**

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జగన్నాథ రథ యాత్ర ఒడిస్సాలో పూరీలో ఈ రోజు వైభవంగా ప్రారంభమైంది. లక్షలాది మంది ప్రజలు వీక్షిస్తుండగా జగన్నాథ , బలభద్ర , దేవీ సుభద్ర , సుదర్శన విగ్రహాలను ఉంచిన మూడు రథాలు ముందుకు కదలనున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు రథయాత్ర ఉత్సవంలో పాల్గొంటున్నారు. రథయాత్రకు తరలి వచ్చే భక్తుల కోసం ఒడిస్సా ప్రభుత్వం పటిష్ఠమైన ఏర్పాట్లు చేసింది. 2 రోజుల పాటు ప్రభుత్వ సెలవు దినాలు ప్రకటించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని పూరీ జగన్నాథ ఆలయంలో కూడా రథ యాత్ర నిర్వహిస్తున్నారు. ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎన్ టి ఆర్ స్టేడియం నుండి ప్రారంభమైన రథయాత్ర నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు సాగుతుంది.

(డెస్క్)

**పూరి జగన్నాథ్ రథోత్సవం - సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలంలోని ఇస్నాపూర్ లో పూరి జగన్నాథ్ రథోత్సవం ఈ ఉదయం ప్రారంభమైంది. పురవీధుల్లో సాగిన రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

PTC, Sangareddy

**రైళ్ల పునరుద్ధరణ**

కాగజ్ నగర్ - హైదరాబాద్ మధ్య రద్దయిన వివిధ రైళ్లను ఈరోజు నుండి పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలోని

కాగజ్ నగర్ నుంచి పలు ఎక్స్ ప్రెస్ రైళ్లను గతంలో రద్దు చేశారు. వాటిని ఈరోజు నుంచి యధావిధిగా నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పిటిసి, ఆసిఫాబాద్

**సబ్సిడి**

రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసిన నేత కార్మికులకు 2022 సంవత్సరానికి నూలుదారపు సబ్సిడి కింద 4 కోట్ల రూపాయలకు పైగా నిధులు విడుదల అయ్యాయి. వీటిని కార్మికుల ఖాతాలలో జమ చేశారు. 2023 సంవత్సరం సబ్సిడీని కూడా వెంటనే విడుదల చేయాలని నేత కార్మికులు కోరుతున్నారు.

(పిటిసి)

**ఆదివాసీలు**

ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివాసీలు చదువుపై దృష్టి సారించి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జిల్లాలోని వివిధ ఆదివాసి సంఘాల నాయకులు, ప్రజలతో ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, కల్తీకల్లు బారిన పడకుండా ఆదివాసి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. భవిష్యత్తులో ఆదివాసీల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేస్తామని, ఆదివాసీలు కూడా పోలీసులకు మత్తు పదార్థాల నివారణలో పోలీసులకు సహకరించాలన్నారు.

(PTC)

**వర్షాలు**

తెలంగాణ వ్యాప్తంగా రేపు, ఎల్లుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. రేపు ఆదిలాబాద్ , నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ , కామారెడ్డి, మహబూబ్ నగర్ , నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు , మిగిలిన జిల్లాల్లో

తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాగా ఎల్లుండి సంగారెడ్డి , మెదక్ , కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. నిన్న వరంగల్ జిల్లా చెన్నారావ్ పేటలో అత్యధికంగా 6.8 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదు అయింది.

(డెస్క్)

**అగ్ని వీర్**

భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళాల్లో అగ్ని వీర్ నియమాకానికి నోటిఫికేషన్ విడుదల అయినట్టు సంగారెడ్డి జిల్లా ఉపాధికల్పనా అధికారి తెలిపారు. అభ్యర్థులు రేపటి నుంచి 24 వ తేదీ వరకు ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

(పిటిసి)

పాలిసెట్

పాలిసెట్ చివరి విడత కౌన్సిలింగ్ ఈ రోజు ప్రారంభమయింది. రేపటి వరకు ఫీ జు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. వారికి 9వ తేదీన ధృవపత్రాల పరిశీలన నిర్వహిస్తాయి. అభ్యర్థులు 9 ,10 తేదీలలో వెబ్ ఆప్షన్ లను ఇచ్చుకోవాలని , 13 వ తేదీన సీట్లు కేటాయిస్తామని పాలిసెట్ కన్వీనర్ శ్రీ దేవసేన తెలిపారు.

(డెస్క్)